ఆమే!
ఆ కనకమాలక్ష్మే!
అతన్నే పిలిచింది.

“హలో!” అని.

ఎప్పుడొచ్చిందో ఏమో, తనకన్నా ముందే బస్ స్టాప్‌కు వచ్చేసినట్లుంది.

వెర్రినవ్వు నవ్వి ఇబ్బందిగా నిలబడ్డ బ్రహ్మానందం దగ్గరకంటా వచ్చి “ఇదిగోనండి మీ నోట్సు” అంటూ ఓ నోట్ బుక్ ఇచ్చింది.

ఇచ్చి వెంటనే “కాలేజీకేనా?” అనడిగింది.

“అదేనండీ, కాలేజీకే” అన్నాడు.

తాను ఎదురు చూడని సంఘటన.

తాను ఊహించనంతటి సంఘటన.

తనిన్నాళ్ళుగా ఆమె వెంటపడి ఎలా పలకరించాలో తెలియక యమ గించుకులాడిపోతే ఆమె ఎంతో ఈజీగా ‘హలో’ అంటూ “ఇదిగోనండి మీ నోట్సు” అని పలకరించింది పైగా దగ్గరకంటా తనే వచ్చి...

గుండెల్లో ఏమో తెలియని గుబులు ఉవ్వెత్తున ఎగసింది. మనసులో పట్టరాని ఆనందం ముఖంలోకి చిమ్ముకుంటూ వస్తోంది.

“ఇదిగోనండి, మీ నోట్సు” అంటూ ఇచ్చింది.

అది తనది కాదు. అంటే అందులో ఏదో విశేషముందన్న మాట. ఏమిటది చెప్మా?”

ఏవిటో మరది-

పోనీ నోట్ బుక్ తిరగేస్తే...

ఛీ, ఇంతమందిలో పైగా ఆమెదురుగుండానే తిరగెయ్యడం బాగోదు.

మనిషే కాదు, మాట కూడా ఎంత తీయగా వుంది.

తనదృష్టమే అదృష్టం.

తన జన్మే జన్మ!

పుస్తకాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

తల ఎత్తడానికి మనసు సిగ్గు మొగ్గవుతూంది.

గుండె అదురుతూంది.

“ఏమన్నా మాట్లాడాలి. ఏం మాట్లాడాలి” అని తనలో తను తలమునకలవుతూ తలపైకెత్తేడు బ్రహ్మానందం.

ఎప్పుడు బస్సు వచ్చిందో గమనించలేదు.

ఎప్పుడు కనకం బస్సెక్కిందో గమనించలేదు.

ఎప్పుడు ఆ బస్సు ఆమెనెత్తుకు పోయిందో గమనించ లేదు.

అంతా గమనించే సరికి తనొక్కడే బస్ స్టాప్‌లో మిగిలేడు.

తన పరధ్యానానికి తనమీద తనకే కోపం వచ్చి నేలకేసి గట్టిగా కుడికాలు ఎత్తి కొట్టాడు.

కుయ్యో మన్నాడు. ఎందుకంటే,

అతను గట్టిగా ఎత్తివేసిన కాలు పడింది పేడలో కాబట్టి,

“ప్రేమలో పడ్డవాళ్ళు పేడలో కూడా పడ్తారు కామోసు” అని సమాధాన పడ్తున్నాడు.


ఇంతలో తన క్లాస్‌మేట్ జోగినాథంగాడొచ్చాడు. వాడు జోగినాథం కాదు-సోదినాథం. వాడు చెప్పే సోది భరించడానికి వాడు కొట్టే సుత్తి తట్టుకోవడానికి తట్టెడు బియ్యం తిన్నా చాల్దు. ఆ విషయం వాళ్ళ మిత్ర బృందం అంతా ఎప్పుడో గమనించి వాడ్తో తగవు వేసుకుని ‘పచ్చి’ కొట్టేసారు.

బ్రహ్మానందానికి మరీ మొహమాటం.

వాడి సోది భరించలేడు, వాడ్ని వదిలించుకోలేడు.

బస్‌స్టాప్‌లో ఒంటరిగా ఉన్నాంగదా, ఆ నోట్‌బుక్ తిరగేద్దామనుకునేంతలో ఈ సోదినాథంగాడు తగలడ్డాడు.

“ఏవోయ్! రాచకొండ సత్యనారాయణ శాస్త్రిగారి వేయి పడగలు చదివావా?” అనడిగాడు భుజం మీద చేయి వేస్తూ.



''రావకొండ విశ్వనాథశాస్త్రివేరు, విశ్వనాథ సత్య నారాయణ వేరు. వాళ్ళిద్దర్నీ కలిపేసి కన్‌ఫ్యూజయి పోయి నన్ను కన్‌ఫ్యూజ్ చెయ్యకు. పైగా రచయితల పేర్లు తెలీనివాడివి రచనల గురించి మాట్లాడతావేం?'' అన్నాడు బ్రహ్మానందం విసుగ్గా.

అదేవిటోయ్ అంత విసుగు. పోనీ విశ్వనాథశాస్త్రిగారి వేయి పడగలు...''

''ఆగాపు. విశ్వనాథ సత్యనారాయణగారిది వేయి పడగలు''

''ఓహో! ఎవరైతేనేం అది చదివావా?''

''ఇంత పొద్దున్నే అదెందుకు చదవడం? పైగా ఒకటి కాదు, రెండు కాదు వేయి పడగలు...''

''అహ్హహ్హా...భలే జోకావ్. అది వేయి పేజీల పుస్తకం. తెల్సా''

''ఓహో! అలగా''

''అవును. అది చదివావా?''

''చదవలేదు. అయినా ఎందుకు అడుగుతున్నావ్!''

''అబ్బే నువ్ గాని చదివావేమోనని. నువ్ చది వుంటే దాని గురించి తెలుసుకుని నేనూ చదూదా మని... అంతే...''

''ఛంపావ్. నువ్వు చదవకుండానే ఇంత సోది కొట్టావా!'' అని ఆశ్చర్యంగా చూస్తుంటే...''అదేవి టోయ్, సోదంటావ్'' అనడిగేడు జోగినాథం కొంచెం ఇదిగా.

''ఇంకా నయం ఆ వేయి పడగల్నూ ఈ సోదినాథం గాడుగాని చదివుంటే మొత్తం వేయి పేజీల నవల ఇలా ఈ బస్టాండ్‌లో నిలబెట్టి లెక్చరిచ్చేసుండేవాడు. అది

---

ప్రియమైన అల్లుడిగార్కి,

మా ఊళ్ళో దబ్బులు కరవుగా వుంది గనుక ఈ పండుగకి మీ ఇంటికి మేమందరం రావాలని అనుకుంటున్నాం. ఒక వారం ముందే వస్తాం. దయచేసి రైల్వే స్టేషన్‌కు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకోగలరు.

ఇట్లు
మీ మామ
దీనదయాళు.

పి. విమల

---

తప్పింది. కాని, వీడ్ని తప్పించుకోవడం ఎలా?

''ఒరేయ్ జోగిగా!'' అంటూ ఎవరో మీసాలాయన సైకిలాపి పిలుస్తున్నాడు. పసిరికకి బుర్ర మీసాలొస్తే ఎలా వుంటాడో అలా వున్నాడాయన.

''ఎవరో కాదు, మా మావయ్యే!'' అన్నాడు జోగి నాథం.

''వెళ్ళిళ్ళు, బేగెళ్ళు పెద్దాయన బాగోదు, ఆయన గాని వేయి పడగలు చదివేడేమో అడుగు'' అంటూ తరిమేడు బ్రహ్మానందం.

వాడటు వెళ్ళేడు.

వీడిటు జారుకున్నాడు.

కాలేజీ గ్రౌండ్‌లో, పెద్ద మర్రి చెట్టు నీడలో ఏకాంతం చూస్కొని కర్చీఫ్ పరచి కూర్చున్నాడు.

కనకమాలక్ష్మి ఇచ్చిన నోట్‌బుక్‌ని అతి సుతారంగా పట్టుకుని పెదిమల్కి తగిలించుకుని ముద్దులెడ్తున్నాడు.

''హలో! గురూ!'' అన్న కేక వినబడింది.

ఆ కేక వినవచ్చిన దిక్కు చూస్తే ఇంకేముంది. ఆ జోగినాథం ఇంతింత అంగలేస్కుంటూ తన వైపే వస్తున్నాడు.

బ్రహ్మానందం గుండెలు జారిపోయాయి.

ఏల్నాటి శని అంటే ఇదే. వదిలించుకున్న కొద్దీ తగుల్కుంటుందంటారు.

వెర్రిమొగమేస్తూ ''ఎందుకిలా వచ్చేవ్!'' అనడి గేడు.


''ఎందుకేవిటిగురూ! మనకివాళ్ళ ఫస్ట్ పిరియడ్ లేదు. నీ కోసం వెతుకుతూంటే ఇక్కడున్నావని ఆ గుర్నాథంగాడు చెప్పేడు'' అంటూ ఇతని ప్రక్కనే సర్దుకుని కూర్చున్నాడు.

వీడ్నెలాగైనా వదిలించుకోవాలి. ఎలా? అని అనుకుం టుండగా-

''గురూ! నల్లమన్నాటి కుటుంబరావు రాసిన 'పతి భక్తి' కథ చదివేవ్?'' అనడిగేడు.

''అది నల్ల మన్నాటిది కాదు కొడవటిగంటి కుటుం బరావు రాసింది.''

''సర్లే, ఎవరో ఒకరు. ఆ కథ భలే బాగుంటుంది గురూ! పెళ్ళాం అలా వున్నా కష్టమే, ఇలా వున్నా కష్టమే. భలే హాస్యం. అసలు పాతివ్రత్యం అంటే...''



అతని మాట పూర్తవకముందే అతని రెండు చేతుల్నీ తన చేతుల్లో గట్టిగా పట్టుకుని, సాధ్యమైనంత మంద్ర స్థాయిలో, బొంగురు పోతున్న కంఠాన్ని అదుపులో పెట్టుకుంటూ "బాబూ! నాయనా! నాయనరే నాయనా! నన్ను కాసేపిలా ఒంటరిగా వదిలెయ్. నాకు ఏకాంతం...ఏకాంతం కావాలి. అదెందుకనడక్కు. ఎందుకో ఒకందుకు కావాలి. నన్నిలా నువ్ ఒంటరిగా ఒదిలేస్తే అందుగ్గాను చచ్చి నీ కడుపున పుడ్తా. ఒకేళ, చావకపోయినా ఎలాగోలా నీ కడుపున పుడ్తా" అని బతిమాలేడు బ్రహ్మానందం.

"ఏవిటో, పొద్దున్నించీ గమనిస్తున్నా. నీలో ఏదో మార్పు కనిపిస్తోంది. అది సరి పోనీలే. నే వెళ్తా" అంటూ లేచి నాలుగడుగులు వేసాడో లేదో మళ్ళీ ఏదో తట్టి గభాల్న వెనక్కి తిరిగి చావకపోయినా ఎలాగోలా నా కడుపున పుడ్తావా" అనడిగేడు సోదినాధం.

"అవును" అన్నాడు ఇంచుమించు ఏడుపు గొంతుతో.

"అందులో ఏదో బూతర్థం గోచరిస్తోందోయ్. ఛస్తేనా కడుపున పుట్టగలనేమో, చావకపోయినా ఎలా పుడ్తావ్?"

"అంటే రేపు నా చదువయి, ఉద్యోగమయి, పెళ్ళయి నేను కాపురం చేస్తుంటే నువ్వొచ్చి మా ఆవిడ్కి లైనేసి, మా ఆవిడ్ని వల్లో వేసుకుని..."

అమాంతంగా వాడి మాట మధ్యలోనే అడ్డుకుంటూ "అయ్యో, అంత దూరం ఆలోచించలేదు. అంత దూరాలోచన నా గుండెని వేయి చెక్కలు చేసినా కనబడదు. దయచేసి నన్ను క్షమించెయ్!" అంటూ చేతులు జోడించాడు. "ఏకాంతం-ఏకాంతం కావాలి" అనడిగాడు జాలిగా.

వాడు మరేం కళనున్నాడో క్షమించినట్టుగా వెను దిరిగి వెళ్ళిపోయాడు.

"హమ్మయ్య" అని కుదుట పడిన వాడై మళ్ళీ నోటు బుక్కును తీసుకుని ఈసారి ముద్దు లెట్టకుండానే పేజీలు తిరగేసాడు.

"మిస్టర్ బ్రహ్మానందం" అన్న పదం కనబడింది.

ఆత్రుతని అణచుకుంటూ ఓసారి అటూ ఇటూ చూసి ప్రశాంత మనస్సుతో మళ్ళీ మొదలెట్టాడు.

"మిస్టర్ బ్రహ్మానందం!

నీనుంచి అందుకున్న ప్రేమ లేఖని ఎంతో జాగ్రత్తగా చదివాను. అచ్చం ప్రేమ లేఖలానే వుంది. నేను ఎయిత్ క్లాస్ చదువుతుండగాననుకుంటా మొదటి ప్రేమ లేఖ నందుకున్నది. అది చూస్తూనే క్లాసులో తెలివితప్పి పడిపోయాను. నాకది తెలిసీ తెలియని వయసు. గాభరాపడిపోయాను. ఆ తర్వాత నైన్త్ క్లాస్‌లో ముగ్గురి ప్రేమ లేఖలు...మా ఇంటి ఎదురుగుండా వుండే సత్యం మాస్టారిగారబ్బాయి ప్రేమ లేఖలు, వెర్రి చూపులు, వెకిలి నవ్వులు-అర్థం పర్థం లేని సైగలు.

ఇప్పుడు నీ లేఖ...

నేనెవ్వరికీ సమాధానమీయలేదు. అసలు పట్టించుకోనైనా పట్టించుకోలేదు. నీకెందుకో తిరిగి సమాధానమీయాలని అనిపించింది. ఇస్తున్నాను.

నీ ప్రేమ లేఖ నేను ఇంతకు ముందు అందుకున్న ప్రేమలేఖలకేం తీసిపోలేదు. వాటిమల్లేనే వుంది. బహుశా ప్రేమలేఖలన్నీ ఒకే మూసలో వుంటాయి గామోసు.

లేక 'ప్రేమ' అనేది అందరి మగ ప్రేమికుల్లోనూ ఒకేలా మొదలవుతుంది గామోసు..."

ఏమో, నాకు ప్రేమంటే సరైన అవగాహన లేదు.

అసలు 'ప్రేమ' అనేది లేనే లేదని నా విశ్వాసం. ఎందువల్లనంటావేమో, ప్రేమ అనేది అవసరంనించి పుడుతుంది. దానికి చపలత్వంవుంది.

అంటే స్థిరత్వం లోపించినది అని.

అది వ్యామోహానికి
మరో పేరేమో?

ఎప్పుడూ మనసనేది ఒక్కలా వుండదు కదా! ఇప్పుడు ఇష్టపడేది మరునాటికి వెగటన వచ్చు. మరప్పుడు 'ప్రేమ' అనేది అటూ ఇటూ చలించవచ్చుకదా!"

అందుతుందన్నప్పుడు ప్రేమ దాని కదే పుట్టుకొస్తుంది. ఇది అందదు అని తెలియంగానే దానికదే మాయమవుతుంది.

స్థిరత్వం లేనిది, శాశ్వతం కానిది 'ప్రేమ' ప్రేమెలా అవుతుంది? ఇది నాకో తీరని సమస్య.

ఇది వేదాంతం కాదు.

నాలోని ఘర్షణ.

ఇదంతా చదివి, ఇది జీవితంలో పెద్ద లవ్‌లో ఫెయిలయిన కేండిడేట్ అనుకునేవు. అలాంటిదేం లేదు.

అసలు నా డిక్షనరీలో 'ప్రేమ' అనేదే లేదుగా. కాబట్టి అసలు విషయానికి డైరెక్టుగా వద్దాం.

నేనింత వరకు నీ కెటువంటి సహాయం చేయలేదు. నీకు కష్టాలేమైనా వస్తే ఆదుకుని ఆదరించలేదు. నువ్వే దన్నా రోగంతో బాధపడుతుంటే ఉపచారాలు చేయలేదు. ఇప్పటివరకు నీకేవిధంగానూ ఉపకరించని నాపై నీకు ప్రేమ ఎలా జనించింది?

అపరిచితురాలినికదా!

నా మీద నీకెందుకు ప్రేమ?

బహుశా నాలో నీకు నచ్చే విశేషమేమైనా వుండి వుండవచ్చు. ఏమై వుంటుందని నిజం ఆలోచిస్తే నా రూపురేఖలు కావచ్చు. నా శరీర సౌష్టవం కావచ్చు.

అంతకు మించి తరచి తరచి ఆలోచిస్తే నాకేం తోచటం లేదు.

యవ్వనం శాశ్వతం కాదు.

సౌందర్యం శాశ్వతం కాదు.

మరైతే ఏమిటీ ప్రేమ?

కామ వ్యామోహం లేనిదే ఒక మగాడికి ఒక ఆడదానిమీద ఇష్టం (ప్రేమ) ఏర్పడదు. అలాగే ఒక ఆడదానికి ఒక మగాడిమీద.

అది పిచ్చి ఆకర్షణే తప్ప 'ప్రేమ' కాదు.

వెర్రి వ్యామోహం తప్ప 'ప్రేమ' కాదు.

కాళ్ళూ, చేతులూ లేని వాళ్ళున్నారు. కళ్ళులేని కబోదులున్నారు. తల్లిదండ్రులులేని అనాధలున్నారు. మొగుళ్ళు గెంటేసిన ఆడాళ్ళున్నారు. చీకటింట చెరన బడే చెల్లెళ్ళున్నారు.

అలాంటి వారి పట్ల ప్రేమ జనించాలి తప్ప, అన్నీ సవ్యంగా వున్న నాలాంటి దానిమీద నీ ప్రేమెందుకు?

ఉంటాను తమ్ముడు,
కనక మహాలక్ష్మి.

బ్రహ్మానందం ముఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్క లేదు. వెర్రిగా అలా చూస్తూండి పోయిన బ్రహ్మానందం వైపు మిస్టర్ సోదినాధం అంతంత అంగలేసుకుంటూ రావడం అతడు గమనించలేదు.

## తిరిగొచ్చిన పత్రం

ప్రాణం లేని గదిలో
సీలింగ్ ఫాన్ శవతాండవం.
చిటుక్కు చిటుక్కుమంటూ
మనసు నిండా ఒహాటే గడియారం కాట్లు...
గదినిండా పరుచుకున్న
రాత్రెడు ఆవేదన మెడకు
ఆశల పాటను కట్టి
నీ గుండెలో అమ్ము కావాలని
ఎగరేస్తాను పోస్టులో
నీ 'లార్జెస్ట్ సర్క్యులేటెడ్' బుద్ధితో
నా కువకువలాడే పాటను
నీకనాక్కి నిర్లక్ష్యంలోకి గిరాటు వేస్తావు.



నిర్దయగా నువ్వు కొట్టిన షాటు
నా గుండె మీంచి దొర్లుకుంటూ
బౌండరీ దాటుతుంది.
నా పాటను భుజాన వేసుకుని
పట్టువదలని పౌరుషంతో
తపాలా సంచి మళ్ళీ తయారు!
బుసకొట్టే నీ అట్టహాసం ముందు
బెకబెకలాడుతూ నా పాట-
నీ చూపుల ఎన్‌కౌంటర్‌లో
గుండెలు తూట్లుపడ్డ నా పాట-
భద్రంగా చేరుకున్న తిరుగు టపాలో
ఎండిపోయిన నీ సానుభూతిని
ఎంత పిండినా-
రెండు కన్నీటి బొట్లన్నా రాలవు.

-దిలావర్